మనసొంపుగా



# మా ఇంటి మనుషులు

ఆనంద్‌ని ఒప్పించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది.

ఈ రోజు ఆనంద్ మా ఇంటికి వస్తున్నాడు.

అందుకే అంతులేని ఆనందంతో నా మనసు, తనువు ఉబ్బితబ్బిబ్బవుతున్నాయి.

ఆనంద్ రావడానికి ఇంకా అరగంట టైముంది.

కాని ఎందుకో ఇప్పటికి పదిసార్లు కారిడార్లోకి వచ్చి అతను వస్తున్నాడేమోనని ఎదురుచూశాను. నాకే కాదు. మా ఇంటిలోని వాళ్ళందరికీ కొంచెం టెన్షన్‌గానే వుంది. నా 'సెలక్షన్' ఎలావుందోనని వారంతా ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. నన్ను ప్రొద్దుటి నుంచి ఆటపట్టిస్తున్నారు. అందుకే నా గదిలోకి వెళ్ళిపోయి తలుపేసుకొని బెడ్ మీద వాలిపోయాను. కారిడార్ లోకి వెళ్ళాలన్న కోరికను బలవంతంగా ఆపుకున్నాను.

అక్క, బావగారు, అన్నయ్య ఇప్పటికే నాలుగైదుసార్లు వచ్చి తలుపుపట్టి ఆనంద్ వచ్చేశాడని గట్టిగా అరిచారు. అయినా నేను కదలలేదు. నాకు తెలుసు ఆనంద్ వస్తే నాన్నగారు స్వయంగా నన్ను పిలుస్తారని.

ఆనంద్!నా డిగ్రీ క్లాస్‌మేట్. చాలా చురుగ్గా వుండేవాడు. బాగా చదివేవాడు. మా సెక్షన్‌లో స్టూడెంట్స్ సంఖ్య కేవలం 20 మాత్రమే. అందులో 11 మంది గర్ల్స్ అయితే 9 మంది బాయిస్.

"కాలేజీలో చదువుతున్నా మీరింకా బాగా చిన్నపిల్లలే. అందుకే మీవన్నీ కోతిబుద్ధులు.. కోతి చేష్టలు చేస్తుంటారు. సరే కాలేజీ వదిలేశాక ఎలాగూ బాధ్యతలు తప్పవు. అప్పుడు ఆటోమేటిక్‌గా పెద్దరికం వచ్చేస్తుంది. సో కాలేజీ డేస్‌లో హ్యాపీగా పిల్లల్లాగే గడిపేయండి మైడియర్ గర్ల్స్ అండ్ బాయిస్" అనేది మా హిస్టరీ లెక్చరర్.

"గర్ల్‌ఫ్రెండ్స్, బాయ్‌ఫ్రెండ్స్ వుండేది కాలేజీ డేస్‌లోనే.. ఎంజాయ్" అనే వారు మా ఇంగ్లీషు లెక్చరర్. అందరం స్నేహంగా వుండేవాళ్ళం. క్లాస్ స్ట్రెంగ్త్ చాలా తక్కువ కావడంతో అందరం కలుపుగోలుగా వుండేవాళ్ళం. కలిసి సినిమా కెళ్ళేవాళ్ళం. తరచూ ఎవరో ఒకరింట్లో ఆదివారాల్ని సరదాగా గడిపేవాళ్ళం. వీలున్నపుడల్లా పిక్నిక్ ప్రోగ్రామ్స్ ఎరేంజ్ చేసుకునేవాళ్ళం. మా క్లాస్‌మేట్స్ అందరి పేర్లూ అందరి పేరెంట్స్‌కూ బాగా తెలిసిపోయాయి. అంతగా కలిసిమెలసి వుండేవాళ్ళం.

ఆ రోజుల్లో ఆనంద్ పట్ల నాలో ఆకర్షణ పెరిగింది. అతని మాట తీరు, వ్యక్తిత్వం, నాలో ఆరాధనను మరింత పెంచాయి. అనేక సందర్భాలలో ఆనంద్ మాటకు అందరూ విలువ ఇవ్వడం నేను గమనించాను. అయితే ఏనాడూ అతని ముందు నా మనసులోని భావాన్ని వ్యక్తం చేయలేదు. ఎందుకంటే స్నేహంగానే వున్నప్పటికీ ఆనంద్ తన పరిధిలో తానుండి పోయేవాడు. అందువల్ల నేను బయటపడలేక పోయాను.

కాలేజీ రోజులు గడిచిపోయాయి. క్లాస్‌మేట్స్ అందరం తలోకవైపు అయిపోయాం. నేను పి.జి. పూర్తి చేశాక మా ఊరు తిరిగి వచ్చేశాను. నాన్నగారి ప్రమేయంతో ఒకపెద్ద కంపెనీలో మంచి పోస్టింగ్ వచ్చింది. నేను జాయినైపోయాను.

ఒక రోజున ఆఫీసు నుంచి బయటకు వచ్చి ఇంటికి బయలుదేరుతుండగా, ఆనంద్ కనిపించాడు. ఆనందం, ఆశ్చర్యం రెండూ కలిగాయి.


"ఆనంద్!" అని గట్టిగా పిలిచాను. ఆనంద్ రెండుక్షణాలు నావైపు చూసి ఆ తర్వాత గుర్తుపట్టి నవ్వాడు.

"బాగున్నారా! మీరు కొంచెం మారారు. అందుకే గుర్తుపట్ట లేకపోయాను" అన్నాడు.

"ఈ కొత్తపిలుపేమిటి 'మీరు' అంటూ, మనం క్లాస్‌మేట్స్‌గా వున్నప్పుడు నన్ను అనే పిలుచుకునే వాళ్ళం" అన్నాను.

ఆనంద్ నవ్వేసి "చెప్పండి ఎలా వున్నారు? ఏదైనా జాబ్ చేస్తున్నారా? లేక మ్యారేజ్ చేసుకొని సెటిలైపోయారా" అని అడిగాడు.

"ఏదో జాబ్ చేస్తున్నాలే. ఇంకా పెళ్ళి కాలేదు. మా ఇంట్లో వాళ్ళంతా 'నీకెందుకే పెళ్ళి' అంటున్నారు. సరే నీ సంగతేంటి? ఏం చేస్తున్నావిప్పుడు?" అని అడిగాను.



నాలుగో అంతస్థులోవున్న మా కంపెనీ బోర్డు చూపిస్తూ, "ఆ కంపెనీలో మార్కెటింగ్ సెక్షన్‌లో జాబ్‌కోసం అప్లికేషన్ ఇచ్చి వస్తున్నాను. ప్రస్తుతానికి ఏదో చిన్న జాబ్ చేస్తున్నాను" అన్నాడు.

"పి.జి. చేసేశావా?" అడిగాను.

"లేదండి. డిగ్రీతోనే ఆపేశాను. అప్పటి నుంచి జాబ్ ట్రయిల్స్ చేస్తున్నాను" అన్నాడు.

ఇంతలో ఆనంద్ ఫ్రెండ్ రావడంతో "వుంటానండి" అని చెప్పేసి ఆనంద్ వెళ్ళిపోయాడు.

మర్నాడు నేను మార్కెటింగ్ సెక్షన్నుంచి ఆనంద్ అప్లికేషన్ తెప్పించి తనకి జాబ్‌వచ్చేలా ఏర్పాటు చేశాను. నెల రోజుల్లో ఆనంద్ ఆ జాబ్‌లో జాయినయ్యాడు.

నా వల్ల తనకు జాబ్ వచ్చిందని తెలిసి తనకు ఆ మర్నాడు కృతజ్ఞతలు చెప్పాడు. అప్పటినుంచి మా ఆఫీసుకు కొంచెం దూరంలో వున్న రెస్టారెంట్‌లో తరచూ కలుసుకునే వాళ్ళం.

ఓ రోజు ధైర్యం చేసి అతనితో సూటిగా పెళ్ళి గురించి ప్రస్తావించాను. నా మనసులో ప్రేమ గురించి క్లుప్తంగా చెప్పాను. ఆ తర్వాత డైరెక్ట్‌గా పెళ్ళి ప్రస్తావన తెచ్చాను.

ఆనంద్ కొద్దిసేపు ఏమి మాట్లాడలేదు. ఆ తర్వాత మెల్లగా అన్నాడు.

"నువ్వు చాలా ఎమోషనల్‌గా వున్నావు. కాబట్టి నేనిపుడే ఏమి చెప్పను. రెండు రోజులాగి చెప్తాను" అన్నాడు.

"నేను నిర్ణయాన్ని ఆకస్మాత్తుగా తీసుకోలేదు. కొన్ని సంవత్సరాలుగా నీపై నాలో అనురాగం గూడుకట్టుకొని వుంది. ఆ అనురాగాన్ని పండించుకునే అవకాశం ఇవుడు లభించింది. బాగా ఆలోచించి నీ నిర్ణయం చెప్పు" అన్నాను.

రెండు రోజుల తర్వాత మేమిద్దరం మళ్ళీ కలుసుకున్నాం.

"మొన్నటి నీ ప్రపోజల్ గురించి ఆలోచించాను. నిజానికి అందం, చదువు, హోదా వున్న నీ లాంటి అమ్మాయిని చేసుకోవడానికి ఎవరూ వెనుకాడరు. కాని ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే కొన్ని సమస్యలు ఎదురవుతాయి. అందుకే నీ ప్రపోజల్‌ని అంగీకరించలేపోతున్నాను" అన్నాడు.

"ఆఫీస్‌లో తక్కువ స్థాయిలో పనిచేయడం నీకు కష్టంగా అనిపిస్తోందా?" అని అడిగాను.

"అదేం లేదు. నీ సెక్షన్ వేరు, నా సెక్షన్ వేరు, ఇబ్బంది వుంటుందని అనుకోవడం లేదు. కాని ఒక్కటే సమస్య. మీ ఇంటిలో అందరూ హైలీ ఎద్యుకేటెడ్. ఉన్నత హోదాల్లో వున్నవాళ్ళు. నేనేమో కేవలం గ్రాడ్యుయేట్‌ని. నువ్వు కూడా పి.జి. చేశావు. మా ఫ్యామిలీ సర్కిల్‌లో నా స్థాయి వ్యక్తి ఇమడలేడనిపించింది. ఈ ఉద్యోగం కాకపోతే ఇంకో ఉద్యోగం వస్తుంది. కాని జీవితాంతం మీ కుటుంబ సభ్యులతో సంబంధాలుంటాయి. అటు



వంటప్పుడు మీ వాళ్ళు నా వంటి తక్కువ స్థాయి మనిషితో తమ రిలేషన్ చెప్పకోవడానికి ఇబ్బంది పడవచ్చు. నేను చదివిన చదువుకు ఇంతకంటే గొప్ప ఉద్యోగాలు రావు. మీ ఫ్యామిలీలోని వారి హోదాకు, నా హోదాకు నక్కకు నాగలోకానికి వున్నంత తేడా వుంది. నీ మాట కాదనలేక మీ పేరెంట్స్ ఒప్పకున్నా మీ అక్క, బావగారు, అన్నయ్య, మిగతా వాళ్ళంతా చాలా ఇబ్బంది పడతారు. అది లోక సహజం. సొసైటీలో హోదాకున్నంత విలువ, మనిషికి లేదు. ప్రతి వ్యక్తినీ అతని హోదా, స్థాయిని బట్టి గౌరవిస్తారు. నేను మీ ఇంటి సభ్యుడినయితే ఆ గౌరవం నాకు లభిస్తుందని నేననుకోవడం లేదు. ఎందుకంటే నా స్థాయి నాకు తెలుసు కాబట్టి. కనుక నీ మనసును కాదంటున్నందుకు నన్ను మన్నించు" అన్నాడు ఆనంద్.

నేనేమీ ఆ క్షణంలో మాట్లాడలేకపోయాను. నేనప్పుడు ఏం చెప్పినా ఆనంద్ మనసు మార్చడం సాధ్యం కాదనిపించింది. అందుకే ఏమీ మాట్లాడ లేదు.

రెండు రోజులయ్యాక ఆనంద్‌ను కలుసుకొని మా ఇంటికి ఆహ్వానించాను.

"ఎపుడో ఐదారేళ్ళ క్రితం మా ఇంటికి వచ్చావు కదా. మళ్ళీ రాలేదు. అందుకే రేపు సెలవే కాబట్టి 11 గంటలకల్లా మా ఇంటికి వచ్చేయి" అన్నాను.

"ఇప్పుడెందుకు? మరెప్పుడైనా వస్తాలే" అని తప్పించుకోబోయాడు.

"అదేం కుదరదు. రావాల్సిందే" అని పట్టుపట్టాను.

"కొంపదీసి నీ ప్రపోజల్ గురించి మీ ఇంటిలో కూడా చెప్పేశావా? మీ ఇంటికి వస్తే మీ వాళ్ళంతా కలిసి నన్ను తన్నేస్తారు" అన్నాడు నవ్వుతూ.

"అలాంటిదేమీ లేదు. సరదాగా వచ్చేయ్. అంతే టీ తాగేసి వెళ్ళిపోవచ్చు" అన్నాను. ఎలాగైతేనేం ఆనంద్ 'సరే' నన్నాడు.

ఆనంద్ గురించి మా ఇంట్లో అందరికీ ముందే చెప్పేయడంతో వాళ్ళంతా అతని కోసం ఎదురుచూడడం మొదలెట్టారు. అనుకున్నట్టే 11 గంటలకు "అమ్మాయ్ ఆనంద్ వచ్చారమ్మా" అని నాన్నగారు పిలవడంతో నేను బయటకు వచ్చాను.

(ఆ తర్వాత ఏం జరిగిందో వచ్చే వారం చెప్తాను)

— 'మోతీలాస్య'